వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 28 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

**తమిళనాడు ఓబీసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ**

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా

# సీపీ రాధాకృష్ణన్

**తమిళనాడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎంపిక**





- ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. గవర్నర్‌గా విశేష అనుభవం
- ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సీపీ బాధ్యతలు
- అభ్యర్థిని ఇంకా ప్రకటించని ఇండియా కూటమి
- నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 ఆఖరు తేదీ

**న్యూఢిల్లీ,**

వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్టు కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఆదివారం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఉంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తాము విపక్షాలతో కూడా సంప్రదిస్తున్నామని, ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా -మిగతా 2 లో



## 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి.
- ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులు

**హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 21న జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసి -మిగతా 2 లో



## శిశువులకు జన్మనిచ్చే రోబో

- చైనాలో పరిశోధకుల అద్భుత సృష్టి
- ప్రపంచంలో తొలి ప్రెగ్నెన్సీ రోబో ఇదే
- వచ్చే ఏడాది చివరిలోగా ప్రొటోటైప్ రెడీ


**న్యూఢిల్లీ,**

చైనాలో పరిశోధకులు ప్రెగ్నెన్సీ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. గర్భాన్ని ధరించడంతోపాటు కృత్రిమ గర్భంలో నవమాసాలు శిశువును మోసి, సురక్షితంగా ప్రసవించడం ఈ రోబో ప్రత్యేకత. ప్రపంచంలో తొలి 'ప్రెగ్నెన్సీ రోబో' ఇదే. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఈ రోబోను అభివృద్ధి చేస్తున్నట్టు చైనా మీడియా వెల్లడించింది. -మిగతా 2 లో

# బీజేపీ ఓట్ చోర్

**ఈసీతో కలిసి కుతంత్రాలు**

- వారి కుట్రను ఇండియా బ్లాక్ అనుమతించదు
- ప్రమాదంలో రాజ్యాంగం.. ప్రజలు ఐక్యంగా ఉండాలి
- బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించిన రాహుల్ గాంధీ
- పాల్గొన్న ఖర్గే, లాలూ, తేజస్వీపలువురు ఇండియా బ్లాక్ నేతలు




**పాట్నా**

పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు అనీ, అది కూడా చోరీకి గురవుతున్నదని బీజేపీ టార్గెట్‌గా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీహార్‌లోని సాసారం నగరంలో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ఆయన ప్రారంభించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా రాహుల్ ఈ నిరసన ర్యాలీని చేపట్టారు. 16 రోజుల పాటు జరిగే ఈ యాత్ర సెప్టెంబర్ 1న పాట్నాలో ర్యాలీతో ముగుస్తుంది. ఈ యాత్ర బీహార్‌లోని మొత్తం 25 జిల్లాలను కవర్ చేస్తూ 1300 కిలో మీటర్లు సాగనున్నది. ఈ యాత్రలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ -మిగతా 2 లో

# యుద్ధానికి తెర పడుతుందా..

- నేడు ట్రంప్-జెలెన్‌స్కీ కీలక చర్చలు



**న్యూయార్క్**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు జరుగుతున్న తీవ్ర ప్రయత్నాల్లో తుది అడుగుగా భావించే చర్చలకు అమెరికా వేదిక కానున్నది. ఇరు దేశా ల సంఘర్షణకు తెరదించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రం ప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ నేతలు సోమవారం సమావేశం కానున్నారు. అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల తర్వాత ట్రంప్ నేరుగా జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. యుద్ధానికి ఒక ముగింపు పలికేందుకు సోమవారం చర్చలు జరపాలని ప్రతిపాదించగా, దానికి జెలెన్‌స్కీ అంగీకరించారు. దీంతో సోమవారం నాటి చర్చల్లో జెలెన్‌స్కీతో పాటు ఆయనకు మద్దతుగా పలువురు యూరోపియన్ నేతలు కూడా పాల్గొంటున్నారు. అలస్కా చర్చలు పూర్తి ఫలవంతంగా జరిగాయని ప్రకటించిన ట్రంప్, ఆ సమావేశంలో ఎలాంటి ఒప్పందం కుదరలేదని వెల్లడించారు.కాగా, తాను ట్రంప్‌తో సుదీర్ఘమైన, ముఖ్యమైన సంభాషణ జరిపానని, యూరోపియన్ నేతలు కూడా తనతో -మిగతా 2 లో



## బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

- 20 లేదా 21న.. పీఏసీ భేటీలో చర్చించాక తుది నిర్ణయం

**హైదరాబాద్,**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, దాంతో ముడిపడి ఉన్న 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం'పై ఎలా ముందుకెళ్లాలనే దానిపై త్వరలోనే అధికార కాంగ్రెస్ ఒక నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించి, అందులో చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రిజర్వేషన్లపై ఒక నిర్ణయానికి వస్తే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన -మిగతా 2 లో

# ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

**విజన్ లేని సర్కారు వల్ల ప్రజాధనం వృథా అయ్యింది**

- రియల్టీ కోసం వాడలేరని అసెంబ్లీలోనే హెచ్చరించిన!
- వేల కోట్ల రూపాయల ఫార్మాసిటీ పెట్టుబడులు వెనకి
- యువతకు లక్షల ఉద్యోగాలు రాకుండా పోయినయ్
- ఫార్మాసిటీ భూములపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలి
- లేనిపక్షంలో రైతుల తరపున బీఆర్ఎస్ ఉద్యమం
- ప్రభుత్వానికి వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్‌సిటీకి భవిష్యత్తు లేదని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలనే రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరబోదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృథా అవుతున్నదని ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులు -మిగతా 2 లో

## బురద రాజకీయాలు మానుకోండి

- వరద నీళ్లు ఒడిసిపట్టండి..
- రేవంత్ సర్కార్‌కు హరీశ్‌రావు హెచ్చరిక



**సిద్దిపేట**

కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద నీళ్లను ఒడిసిపట్టి.. బురద రాజకీయాలను మానుకోవాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. -మిగతా 2 లో

## రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

- కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రవి



**హైదరాబాద్,**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వివాదంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి ఎంత చెప్పినా వినకుంటే వేటు తప్పదంటూ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డి అంశంపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తనతో చర్చించారని, దీనిపై సమాచారం తెప్పించుకొని -మిగతా 2 లో

# చైనాలో ఆకస్మిక వరదలు

### 8 మంది మృతి



**చైనా -ప్రజా స్వేచ్ఛ**

చైనాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో కనీసం ఎనిమిది మంది మరణించారని ఆ దేశ వార్తా సంస్థ జిన్హువా ఆదివారం నివేదించింది. ఈ వరదల్లో మరో నలుగురు గల్లంతు కాగా, వారిని వెతుకులాట కొనసాగిస్తున్నారు. ఇన్నర్ మంగోలియా ఉత్తర ప్రాంతంలో శనివారం (ఆగస్టు 16) రాత్రి 10 గంటల ప్రాంతంలో వరద సంభవించిందని, క్యాంపింగ్ ట్రిప్‌లో ఉన్న 13 మంది కొట్టుకుపోయారని, ఒకరిని రక్షించారని నివేదిక తెలిపింది. గల్లంతు అయిన వారి కోసం అన్వేషణ, రక్షణ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని జిన్హువా తెలిపింది.

# పాకిస్థాన్ అధ్యక్షుడిగా ఆసిమ్ మునీర్..

### ఆర్మీ చీఫ్ ఏమన్నారంటే?



**ఇస్లామాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

పాకిస్థాన్ తదుపరి అధ్యక్షుడిగా ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ బాధ్యతలు చేపట్టనున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్న ఆసిఫ్ అలీ జర్దారీని తొలగిస్తారని, ఆయన స్థానంలో మునీర్ నియమితులవుతారని గత కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై తాజాగా మునీస్ స్పందించారు. అవన్నీ వట్టి పుకార్లేనని కొట్టిపారేశారు. పాక్ నాయకత్వంలో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదన్నారు. అధ్యక్షుడు జర్దారి తొలగింపు గురించి వస్తున్నవన్నీ గాలి వార్తలేనని స్పష్టం చేశారు. ఇది రాజకీయ కుట్రలో భాగంగానే అవస్థవాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జమ్ముకాశ్మీర్‌లో మరోసారి క్లౌడ్ బరెస్ట్ ..

### ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లాపై మరోసారి క్లౌడ్ బరెస్ట్ విరుచుకుపడింది. దీంతో ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారని అధికారులు ఆదివారం తెలిపారు. ఈ వారం జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో క్లౌడ్ బరెస్ట్ కారణంగా 50మందికి పైగా మరణించగా, 100మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. జాంగ్లోట్‌లోని ఒక గ్రామంలో శనివారం అర్థరాత్రి క్లౌడ్‌బరెస్ట్‌తో మెరుపు వరదలు సంభవించాయి. జిల్లా వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని కథువా జిల్లా సమాచార కేంద్రం హెచ్చరించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశించింది. వరదల కారణంగా నదుల, వాగుల్లో నీటి ప్రవాహం వేగంగా పెరిగే అవకాశం ఉందని, వర్షాలకు కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 01922-238796 మరియు 9858034100 హెల్ప్‌లైన్ నెంబర్లను విడుదల చేసింది. భారీ వర్షపాతం కారణంగా నదుల్లో ప్రవాహం గణనీయంగా పెరిగిందని, ఉజ్ నది ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ప్రవహిస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తుపాను కారణంగా రైల్వేట్రాక్, జాతీయ రహదారి 44, పోలీస్ స్టేషన్ దెబ్బతిన్నాయని ఉధంపూర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. పోలీసులు, సైన్యం మరియు పారామిలటరీ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. కథువా జిల్లాలో సహాయ రక్షణ మరియు తరలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కథువాలోని జోద్‌ఖాడ్, జుతానాతో సహా అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం వలన ప్రాణనష్టం జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారని అన్నారు. వారికుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

# ఢిల్లీలో డేంజర్ బెల్స్..!

### యమునా నదికి భారీ వరద..




**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నగర ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, ముంబైలో చినుకు పడితే చాలు వాహనదారులు, లోతట్టు కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా ఢిల్లీ కూడా వరద ముప్పును ఎదుర్కొంటోంది. యమునా నది (Yamuna River) మరో రెండు రోజుల్లో ఉగ్రరూపం దాల్చనుండడమే అందుకు కారణం. అప్రమత్తమైన ఢిల్లీ ప్రభుత్వం ప్రజలకు ఆదివారం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో యమునా నిండుకుండలా మారింది. ఆదివారం ఉదయం 1.76లక్షల క్యూసెక్కుల నీరు యమునాకు చేరింది. ఇదే విధంగా వరద నీరు వస్తే.. సోమ, మంగళవారం ఉదయం 2 గంటల నాటికి నదిలో 206 మీటర్ల మేర నీరు చేరనుందని వరద నియంత్రణ విభాగం తెలిపింది. నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. రాబోయే వరదను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే లోతట్టు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించింది వరద నియంత్రణ విభాగం. మరోవైపు యమునాలో నీటి ఉధృతి పెరగడంతో హర్యానాలోని ఫరీదాబాద్ గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. అక్కడి రోడ్లన్నీ చెరువును తలపిస్తున్నాయి.

# గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.


### -రెండు వాహనాలు ఢీకొని ఏడుగురు సజీవ దహనం..!



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కనీసం ఏడుగురు మరణించారు. దేదాదర గ్రామం సమీపంలో స్విఫ్ట్ డిజైర్ కారు, టాటా హారియర్ ఎస్‌యూవీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదం చాలా తీవ్రంగా ఉండడం వెంటనే వాహనాన్ని మంటలు అలుముకున్నాయి. వాహనంలోనే ప్రయాణికులంతా చిక్కుకుపోయారు. సమాచారం మేరకు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఘటన జరిగినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత నేపథ్యంలో డిజైర్ వాహనంలో ఉన్న ప్రయాణికులంతా మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని రక్షించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు డిజైర్ వాహనంలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నించినా మంటల్లో ఏడుగురు కాలిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. వాధ్వన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్ పీబీ జడేజా మాట్లాడుతూ.. 'దేదాదర గ్రామం సమీపంలో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగిన సంఘటన తర్వాత కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారని.. ఎస్‌యూవీలో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. ఈ ఘటనతో రద్దీగా ఉండే హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వాహనాలు వేగంగా ఉండడం వల్లే అదుపు తప్పి ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నట్లుగా అనుమానిస్తున్నారు. దాంతో మంటలు చెలరేగాయని పలువురు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# శుభాన్షు శుక్లాకు ఘనస్వాగతం




**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు చారిత్రాత్మక పర్యటన తరువాత భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా ఆదివారం స్వదేశానికి సురక్షితంగా తిరిగివచ్చారు. ఆక్సియం-4 మిషన్ శిక్షణ కోసం గత ఏడాది కాలంగా శుక్లా అమెరికాలో ఉన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా, ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ శుక్లాకు స్వాగతం పలికారు. శుక్లా బ్యాకప్ వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఆదివారం స్వదేశానికి తిరిగి వచ్చారు. శుక్లా త్వరలో ప్రధానమంత్రి మోడీని కలుసుకున్న తరువాత తన స్వస్థలమైన లక్నోకు వెళ్లనున్నారు. అయితే ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఢిల్లీకి మళ్లీ శుక్లా తిరిగిరానున్నారు. జూన్ 25న నిర్వహించిన ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లో శుక్లా విధులు నిర్వహించారు. జూలై 15న భూమికి తిరిగివచ్చారు. రాకేష్ శర్మ తరువాత అంతరిక్షయానం చేసిన రెండో భారతీయుడిగా శుభాన్షు శుక్లా రికార్డుల్లో నిలిచారు.

# అమెరికాలో మరోసారి కాల్పుల మోత.

### ముగ్గురు మృతి




**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగాయి. న్యూయార్క్‌లోని ఓ రెస్టారెంట్‌లో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. న్యూయార్క్ సిటీలోని బ్రూక్లిన్ హుక్కా లాంజ్, రెస్టారెంట్‌లోకి ఆదివారం ఉదయం 3.30 గంటలకు (స్థానిక కాలమాన ప్రకారం) పలువురు దుండగులు తుపాకులతో చొరబడ్డారు. అనంతరం అక్కడ ఉన్నవారిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు పురుషులు మృతిచెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఐదుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. కాల్పుల గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలుస్తోంది. కాగా, ఘటనాస్థలిలో 36 బుల్లెట్ శకలాలు లభించాయని పోలీసులు తెలిపారు. అలాగే ఘటనాస్థలికి కొంచెం దూరంలో రహదారిపై ఒక తుపాకీ దొరికిందని పేర్కొన్నారు. అయితే అది ఈ కాల్పుల్లో ఉపయోగించిందేనా? కాదా? అనేది స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. న్యూయార్క్ నగరంలో ఇలా కాల్పులు జరగడం ఈ నెలలో ఇది రెండోసారి. ఆగస్టు 9వ తేదీన టైమ్ స్క్వేర్ సమీపంలో ఒక టీనేజర్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు.

# వాడిన వంట నూనెతో వైమానిక ఇంధనం

### ఇండియన్ ఆయిల్ రిఫైనరీకి సర్టిఫికేషన్




**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

వేపుళ్ల వంటివాటి కోసం ఒకసారి ఉపయోగించిన వంట నూనెను పారబోసేస్తూ ఉంటారు. ఇటువంటి నూనెతో సుస్థిర వైమానిక ఇంధనం (సుస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్)ను తయారు చేయడానికి ఇండియన్ ఆయిల్ రిఫైనరీకి సర్టిఫికేషన్ లభించింది. హర్యానాలోని పానిపట్ రిఫైనరీకి ఈ సర్టిఫికేషన్ లభించినట్లు ఈ కంపెనీ చైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ తెలిపారు.

మన దేశంలో ఈ సర్టిఫికేషన్‌ను పొందిన ఏకైక కంపెనీ తమదేనన్నారు. పెట్రోలియమేతర పదార్థాల నుంచి తయారు చేసే ప్రత్యామ్నాయ ఇంధనమే ఎస్ఏఎఫ్. ఈ ఇంధనాన్ని వాడటం వల్ల గగనతల రవాణా నుంచి ఉద్గారాలు తగ్గుతాయి. సంప్రదాయ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్ లేదా జెట్ ఫ్యూయల్)లో 50 శాతం వరకు ఈ ఎస్ఏఎఫ్‌ను కలపవచ్చు.

# మనిషి వెంట్రుకల నుంచి టూత్‌పేస్ట్.. దంతక్షయాన్ని ఆపుతుంది



**లండన్ -ప్రజా స్వేచ్ఛ**

లండన్ కింగ్స్ కాలేజీకి చెందిన పరిశోధకులు మానవుల వెంట్రుకల నుండి ఒక అద్భుతమైన టూత్‌పేస్ట్‌ను అభివృద్ధి చేశారు. ఇది దెబ్బతిన్న దంతాలను రక్షించడానికి, మరమ్మతు చేయడానికి ప్రభావ వంతమైన పద్ధతిని అందిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. మానవుడి వెంట్రుకల్లోని 'కెరాటిన్' అనే ప్రొటీన్ సహజ లక్షణాలను ఉపయోగించి..దంతాల్ని రక్షించే ఖనిజ పొర (ఎనామెల్) తిరిగి ఏర్పడేట్టు చేయవచ్చునని వారి అధ్యయనం పేర్కొన్నది. ఎక్కువగా కనిపించిన ఆరోగ్య సమస్యల్లో ఒకటి దంత క్షయం. దీనివల్ల ఎనామెల్ కోత, నోటి పరిశుభ్రత లేకపోవటం, దంతాలు దెబ్బతినటం వంటి వాటికి దారితీస్తుంది. దీనిని సాధారణ టూత్‌పేస్ట్ నెమ్మదింపజేస్తుంది. కానీ పూర్తిగా ఆపదు. అయితే కెరాటిన్ ఆధారిత చికిత్సలు దంత క్షయాన్ని పూర్తిగా ఆపేస్తాయి.

## 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

(మొదటి తరువాయి)

కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతులమీదు గా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా సీఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి ”తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు-ప్రభుత్వ ప్రణాళిక” అనే విషయంపై సీఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హౌదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డియేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ”సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ ” తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వీసీ తెలిపారు.

## శిశువులకు జన్మనిచ్చే రోబో

(మొదటి తరువాయి)

నెలలు నిండకుండా జన్మించే శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంక్యుబేటర్ల కంటే ఈ రోబో చాలా భిన్నమైనది. గర్భాన్ని ధరించడం మొదలుకొని శిశువు జననం వరకు మొత్తం గర్భధారణ ప్రక్రియను ఈ రోబో అనుకరిస్తుంది. అంటే గర్భధారణ నుంచి ప్రసవం వరకు శిశువు పూర్తిగా హ్యూమనాయిడ్ రోబోలోని టెక్ గర్భంలో పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో కృత్రిమ గర్భ సాంకేతికత (ఆర్టిఫిషియల్ ఊంబ్ టెక్నాలజీ) ప్రధానమైనది. రోబో బొడ్డులో అమ్నియోటిక్ ద్రవంతో నింపిన కృత్రిమ గర్భం మానవ గర్భాన్ని అనుకరిస్తూ పిండం పెరుగుదలకు అనువైన పరిస్థితిని కల్పిస్తుంది. సహజంగా జన్మించే శిశువుకు జరాయువు (ప్లాసెంటా) ద్వారా పోషకాలు అందినట్టు ప్రెగ్నెన్సీ రోబోలో కృత్రిమ గర్భానికి జత చేసిన ట్యూబ్ ద్వారా శిశువుకు పోషకాలు అందుతాయి. కృత్రిమ గర్భ సాంకేతికత ఇప్పటికే పరిణితి చెందిన దశలో ఉన్నదని, ఇప్పుడు దీన్ని రోబో ఉదరంలో అమర్చాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా నిజమైన వ్యక్తి ఆ రోబోతో ఇంటరాక్ట్ అయి గర్భధారణకు, ఆ గర్భంలో పిండం పెరుగుదలకు వీలు కల్పించాల్సి ఉన్నదని డాక్టర్ జాంగ్ వివరించారు. నిజానికి ఇదేమీ పూర్తిగా కొత్త భావన కాదని, గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ 'బయోబ్యాగ్'లో గొర్రెపిల్లను విజయవంతంగా పెంచారని, ఆర్టిఫిషియల్ ఊంబ్ ఆలోచనకు అప్పుడే బీజం పడిందని తెలిపారు. ప్రెగ్నెన్సీ రోబో ప్రొటోటైప్ (నమూనా) వచ్చే ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, అందుకు దాదాపు లక్ష యువాన్లు (రూ.12.96 లక్షలు) ఖర్చవుతుందని అంచనా.

## యుద్ధానికి తెర పడుతుందా..

(మొదటి తరువాయి)

కలిశారని, చాలా ముఖ్యమైన అంశాలు చర్చించినట్టు జెలెన్‌స్కీ తెలిపారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు సోమవారం తాను యూఎస్‌కు బయలుదేరుతున్నట్టు ఆయన చెప్పారు. చర్చలకు ఆహ్వానం పలికిన ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి అంతం పలికేందుకు, సాధారణ ప్రజల మరణాలకు ముగింపు పలికే దిశగా ట్రంప్‌తో సమగ్రంగా చర్చిస్తానని జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టారు. ఉక్రెయిన్-రష్యా సంఘర్షణను తెరదించడానికి యూరోపియన్ దేశాలు సహకరించాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. అమెరికాతో పాటు యూరోపియన్ దేశాల నుంచి తమ భద్రతకు హామీ కోరుతున్నామన్నారు. సెక్యూరిటీ గ్యారంటీ కావాలని ఉద్ఘాటించారు.

**చర్చల్లో ఎవరెవరు?**

యూఎస్‌లో సోమవారం నాటి చర్చల్లో ట్రంప్, జెలెన్‌స్కీతో పాటు ఆయ నకు మద్దతుగా యూరప్ నేతలు కూడా పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్, జర్మన్ చాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్, ఫిన్నిష్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సుల వాండర్ లేయన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే తదితరులు చర్చల్లో పాల్గొంటున్నారు.

## బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

(మొదటి తరువాయి)

అంశంపైనా సమావేశంలోనే చర్చించనున్నట్టు సమాచారం. ఈ మేరకు పీఏసీ సమావేశాన్ని ఈ నెల 20 లేదా 21న నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి 18వ తేదీనే క్యాబినెట్ భేటీ నిర్వహించి, ఆ తరువాత పీఏసీ సమావేశం పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ రాష్ట్రంలో వారం నుంచి వానలు కురుస్తుండడం, మరో 2-3 రోజులపాటు భారీ వర్షాలు ఉండొచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాయిదా వేశారు. ఇక.. 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. ఆయన తిరిగొచ్చిన తరువాత.. 23 లేదా 24న క్యాబినేట్ భేటీ ఉంటుందని అధికారికవర్గాలు అంటున్నాయి. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల నిర్వహణ పై ఈ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా నిర్వహించింది. అయితే, కేంద్రం నుంచి దీనిపై ఇంకా సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. అలాగే రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల వైఖరిని కూడా ప్రభుత్వం తెలుసుకోనుంది. కాగా.. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఈసారి సభలో బీసీల రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఇచ్చిన నివేదిక కూడా ప్ర?ధానాంశం కానుంది. ఆ నివేదికను సభలో మొత్తం సభ్యులందరికి అందించి, దానిపై చర్చ పెట్టనున్నారు. అలాగే కాళేశ్వరం నిర్మాణ నుంచి కూలడం వరకు జరిగిన పరిణామక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో సభలోని సభ్యులకు వివరించే అవకాశం ఉందని కూడా తెలిసింది.

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

(మొదటి తరువాయి)

ఎన్నుకోవడానికి సహకరించాలని వారిని కోరుతున్నామని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.

పార్లమెంట్ ఉభయ సభల్లో 786 మంది సభ్యులుండగా, ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికి కనీసం 394 ఓట్లు అవసరం. అయితే ఎన్డీఏ కూటమికి రెండు సభల్లో కలిపి 422 ఓట్లు ఉన్నాయి. దీంతో ఆ అభ్యర్థి ఎన్నిక నల్లేరు మీద బండిగా భావిస్తున్నారు. కాగా, ఇంతకుముందు ఉప రాష్ట్రపతిగా పనిచేసిన జగదీప్ ధన్‌ఖడ్ కూడా ఆ పదవికిలోకి రాకముందు గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఆగస్టు 21 ఆఖరు తేదీ. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖ నేతలు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి దింపేందుకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నట్టు ఇండియా కూటమి తెలిపింది.

**తమిళనాడు మోదీ'గా గుర్తింపు**

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957, అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. తమిళనాడులో ప్రభావవంతమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన ఈ ఓబీసీ నేతకు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో సుమారు 40 ఏండ్ల అనుభవం ఉంది. తమిళనాడు మోదీగా ఆయనను పిలుస్తారు. 2003 నుంచి 2006 వరకు ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న ఆయన తమిళనాడులో రెండు సార్లు ఎంపీగా చేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 2024, జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 ఫిబ్రవరి 18 నుంచి 2024 జూలై 30 వరకు జార?ండ్ గవర్నర్‌గా, 2024 మార్చి నుంచి జూలై వరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌గా 2024 మార్చి నుంచి ఆగస్టు వరకు పనిచేశారు.

## బీజేపీ ఓట్ చోర్

(మొదటి తరువాయి)

ఖర్గే, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ కీలక నేత తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు దీపాంకర్ భట్టాచార్య వంటి ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. ఇప్పటికే 'ఓట్ చోరీ' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలను నిర్వహించిన విషయం విదితమే. ఈ ప్రారంభోత్సవ సభలో రాహుల్ ప్రసంగించారు. బీజేపీ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయాలను సాధించటానికి అవకతవకలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ” లక్షలాది మంది ఓటు హక్కును తొలగించటానికి బీజేపీ ఓటర్లను అణచివేస్తున్నది.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలను మార్చటం వంటి సందేహాస్పదమైన పద్ధతులను ఉపయోగిస్తున్నది. రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నది. పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు. అది కూడా చోరీకి గురవుతున్నది” అని రాహుల్ అన్నారు. ఇలాంటి వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసీతో కలిసి బీజేపీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తోందనీ, ఇప్పుడిది ప్రపంచం మొత్తానికీ తెలుసు అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించటానికి, వారి కుట్రలో విజయం సాధించటానికి ఇండియా బ్లాక్ అనుమతించబోదని చెప్పారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ఈసీ తన నుంచి అఫిడవిట్ కోరిందనీ, బీజేపీ నేతలు కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తే మాత్రం ఈ ప్రస్తావనను తీసుకురాలేదని రాహుల్ అన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయనీ, ఇది రాజ్యాంగాన్ని కాపాడటానికి జరుగుతున్న పోరాటమని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తున్నారనీ, బీహార్‌లో ఓట్లను దొంగిలించడానికి ఎస్ఐఆర్ ద్వారా ఓటర్లను తొలగించి, చేర్చడమే వారి కుట్ర అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఇండియా బ్లాక్ సత్తా చాటిందనీ, మహారాష్ట్రలో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలోనూ ఇండియా బ్లాక్ విజయం సాధిస్తుందని చెప్పాయని, కానీ నాలుగు నెలల్లో కోటి మందికి పైగా ఓటర్లు చేరటంతో బీజేపీ గెలిచిందని చెప్పారు. ఓటర్లను చేర్చిన నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించిందని అన్నారు. కర్నాటకలోని ఒకే నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లు తారుమార య్యాయని దర్యాప్తులో తేలిందనీ, ఓటర్లను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ యాత్రను ఆయన ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటంగా, రాజ్యాంగ విలువలను కాపాడే ఉద్యమంగా అభివర్ణించారు. ప్రజలు తమ ఓటు హక్కులను కాపాడుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు.

**రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానం : లాలూ**

ఎన్డీఏ బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేసిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల అణచివేతను జరుపుతున్నదని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. ఈ సమావేశంలో అక్కడి జనసమూహాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ”మేము ప్రజాస్వామ్యం కోసం త్యాగాలు చేశాం. ఈ యాత్ర రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానమైన ఉద్యమానికి నాంది పలుకుతుంది” అని లాలూ అన్నారు.

**ఈసీ విఫలం : ఖర్గే**

ఈసీ అన్ని రికార్డులనూ అందుబాటులో ఉంచినప్పటికీ.. ఓటర్ల డేటాలో వ్యత్యాసాలను పరిష్కరించటంలో విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. సాధారణ పౌరుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడటానికి ఈ యాత్ర 'చారిత్రక పోరాటం' అని ఆయన అభివర్ణించారు. ఈ యాత్ర పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల కోసం జరిగే పోరాటమని తేజస్వీ యాదవ్ అన్నారు. బీజేపీ నిరంకుశ వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయటం ఈయాత్ర లక్ష్యమని చెప్పారు.

## ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

(మొదటి తరువాయి)

మోసపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఫ్యూచర్‌సిటీ ఊహాజనిత ప్రాజెక్టు**

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని కేటీఆర్ దుయ్యబట్టారు. నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో చెప్పడానికి ఫ్యూచర్‌సిటీ అనే ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజాప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేండ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదురొంటున్నదని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని తెలిపారు.

## రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

(మొదటి తరువాయి)



పరిశీలిస్తానని స్పష్టంచేశారు. మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డి పదే పదే ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిపై వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు వచ్చాక వచ్చే వారం మరోసారి సమావేశమై చర్చిస్తామని చెప్పారు. ఇక వరంగల్ జిల్లా నేతల పంచాయితీపై నలుగురు సభ్యులతో కమిటీని నియమించనున్నట్టు తెలిపారు

## బురద రాజకీయాలు మానుకోండి

(మొదటి తరువాయి)



సిద్ధిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.కాళేశ్వరం మోటార్లపై కాంగ్రెస్ కుట్ర పన్నింది. మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు. అవేమన్న మీ ఇంట్లో ఉండే మోటార్లు అనుకున్నారా? అలా చేస్తే మోటార్లు పాడైతాయి. బేరింగ్లు పోతాయి.. వేలకోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంపై బీహెచ్‌ఈఎల్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మోటార్లు పనికిరాకుండా అయితే మళ్లీ ఆ బద్నాం బీఆర్ఎస్ పార్టీపై వేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టింది. ఇప్పటికైనా బురద రాజకీయాలు మాని వరద నీటిని ఒడిసి పట్టండి అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం కలుగుతున్నది. ఉన్న వ్యవస్థను నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదా..? కమీషన్లకు, వాటాలు పంచుకోవడానికి సమయం సరిపోతలేదా..? రైతు ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా ? నంది మేడారంలో ఖటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశాను. అన్నపూర్ణ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి. వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాను. దురదృష్టం ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల విలువ రైతులకు తెలుస్తది.. ఉత్తంకుమార్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి తెలియదు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు. ఆయన రైతు గనుక ప్రతి చుక్కను ఒడిసిపట్టి నీళ్లను రైతులకు అందించాడు. మీరు ఎన్నడు వ్యవసాయం చేయలేదు అందుకే మీకు నేల విలువ తెలియదు. ఈ రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదు. కాంగ్రెస్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## సంపాదకీయం

# త్యాగాలకు మకిలి అంటదు



'జీవించడానికి ఒక కారణం వుండాలి, మరణించడానికి ఒక విలువ వుండాలి' అంటారు అంబేద్కర్. ప్రపంచ చరిత్ర ప్రతి పుటలోనూ దేశం కోసం, జాతి విముక్తి కోసం చేసిన ప్రాణ త్యాగాలు మన కళ్ల ముందు కదలాడతాయి. స్ఫూర్తివంతమైన పోరాటాలతో త్యాగానికి పర్యాయ పదంగా నిలిచి, తమ జీవితాలను చరితార్థం చేసుకున్న వారు అనేకం. భారతదేశ స్వాతంత్ర్యం దాని నిజమైన వారసుల అసాధారణ ధైర్యం, తెగువ, నిస్వార్థతకు నివాళిగా నిలుస్తుంది. 'త్యాగాలు చరిత్ర పుటల్ని వెలిగించే దీపస్తంభాలు' అంటారో రచయిత. తన చివరి శ్వాస వరకూ దేశ సేవకే అంకితమైన సైనికులు, స్వాతంత్ర్యం కోసం ఉరిశిక్షను ధైర్యంగా ఎదుర్కొన్న యువకులు, సమాజం కోసం తమ మేధస్సును కొవ్వొత్తిలా కరిగించిన నాయకులు వీరి చరిత్రలు, చరిత్రలో వీరి జ్ఞాపకాలు మనకు త్యాగం అంటే ఏమిటో నేర్పుతాయి. 'దేశం కోసం ప్రాణాలు అర్పించినవారు చనిపోలేదు, మనం వారి త్యాగాలను మరచినప్పుడే వారు నిజంగా చనిపోతారు' అంటారు అమెరికన్ రచయిత లారెన్స్ బిన్యాన్ తన 'ఫర్ ద ఫాలెన్' అనే కవితలో. బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా సాగిన అచంచల పోరాట స్ఫూర్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని నేటికీ కాపాడుతోంది. 'జీవితం కన్నా విలువైనది దేశం' అన్న భావనను నకిలీ దేశభక్తి మసకబార్చే ప్రయత్నం పెద్దఎత్తున చేస్తోంది. దేశభక్తి ఒక జీవన విధానంగా కాక, ఒక ప్రచార బ్రాండ్‌గా మారిపోయింది.

త్యాగమనే పదం ఒకప్పుడు పవిత్ర గ్రంధంలా భావించబడేది. దేశం కోసం, జాతికోసం ప్రాణాలు అర్పించినవారు, స్వార్థాలను త్యజించి సత్యం కోసం పోరాడినవారు త్యాగానికి పర్యాయపదంగా నిలిచారు. గాంధీజీ నుంచి గోపాలకృష్ణ గోఖలే వరకు, అల్లూరి నుంచి భగత్‌సింగ్ వరకూ అనేకుల జీవితాల బలిదానం ఈ దేశానికి స్వేచ్ఛనిచ్చింది. నేడు త్యాగం యొక్క అసలు అర్థాన్ని వక్రీకరిస్తూ, సత్యానికి మసిపూస్తూ నకిలీ నిర్వచనాలను వల్లెవేస్తున్నారు. తాజాగా భారత ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవంనాడు ఎర్రకోట నుంచి కాషాయోపనిషత్తులను వల్లించారు. గాంధీజీ హత్య తర్వాత నిషేధించబడిన ఆర్‌ఎస్‌ఎస్‌కు, ఈ హత్య కుట్ర కేసులో విచారణకు గురైన వి.డి.సావర్కర్‌కు స్వాతంత్ర్యం మాతృకను కట్టబెట్టాలనుకునే వారి ప్రయత్నం.. చరిత్రను తిరస్కరించడమే. స్వాతంత్ర్య పోరాటాన్ని అవమానించడానికి, బ్రిటిష్ వారికి సేవ చేసిన వారిని, ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తించడానికి ఎర్రకోటను వేదికగా చేసుకున్నారు ప్రధాని. కేంద్ర పెట్రోలియం మంత్రి అయితే, తమ శాఖ శుభాకాంక్షల కార్డులో గాంధీజీ ఫొటో కంటే, సావర్కర్ ఫొటోను ప్రముఖంగా ముద్రించారు. ఇవన్నీ కలిపి చూస్తే.. ఇదంతా పెద్ద కుట్రలో భాగమనే అర్థమౌతుంది. భారతీయులంతా కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటే, ఆ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ దేశద్రోహుల పాత్ర పోషించింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెట్టే జాతీయవాదానికి బదులుగా, మెజారిటీ మతతత్వమైన హిందూత్వ జాతీయవాదాన్ని సమర్థించారు. ఇది జాతీయోద్యమ స్ఫూర్తిని, స్వాతంత్ర్యోద్యమ చరిత్రను కించపరచడమే అవుతుంది. స్వాతంత్ర్య పోరాటంలోని అన్ని దశల్లోనూ దూరంగా వున్న ఆర్‌ఎస్‌ఎస్, ఇప్పుడు జాతీయోద్యమంలో కూడా తన పాత్ర వుందని నిరూపించుకోడానికి తప్పుడు కథనాలను వండి వార్చడంలో నిమగ్నమైవుంది. భారతదేశ గొప్ప స్వాతంత్ర్య పోరాట చరిత్ర– అమానవీయ మతతత్వ భావాజాలాన్ని మోసేవారిది కాదు. గాంధీజీ, భగత్‌సింగ్ వంటి వారి త్యాగాలతో నిర్మితమైన భారతీయ చరిత్రను తుడిచివేయాలనుకునే ఏ చర్యనైనా దేశం సమైక్యంగా ఎదుర్కోవాలి. రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని అమలు చేయాలనుకునే వారి కుట్రలను తిప్పికొట్టాలి. 'నేను బలి కావడానికి సిద్ధంగా ఉన్నాను, ఎందుకంటే నా దేశం స్వేచ్ఛగా శ్వాసించాలి' అంటాడు భగత్‌సింగ్. ఇలాంటి త్యాగాలకు కొత్త నిర్వచనాలు కట్టాల్సిన అవసరం లేదు. త్యాగాలకు మకిలి అంటదు, నిప్పుకు చెదలు పట్టదు. త్యాగమూ అంతే. అది సమాజానికి ఒక శాశ్వత స్ఫూర్తి. ఈ విలువైన వారసత్వాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం. 'జీవించడం అంటే ఇతరుల కోసం జీవించడం' అన్న స్వామి వివేకానంద మాటలు నిజమైన త్యాగానికి సరైన నిర్వచనం.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతు ప్రకటించిన దక్షిణ కొరియా..

## ధన్యవాదాలు తెలిపిన జైశంకర్



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

పహల్గామ్ ఉగ్రదాడి, ఉగ్రవాదంపై పోరాటంలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యూన్ భారత్‌కు సంఘీభావం ప్రకటించారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశం నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చో హ్యూన్ దక్షిణ కొరియా ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయంలో తాము చాలా కఠినంగా, దృఢంగా ఉన్నామన్నారు. ఏదైనా ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారత ప్రభుత్వం, భారత ప్రజలతో ఉంటామన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22 పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు 26 మంది దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. మే 7న భారత్ సిందూర్‌ను ఆపరేషన్ చేపట్టగా.. వందలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని.. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారతదేశం ఖచ్చితమైన దాడులు చేసింది. పాకిస్తాన్ దుస్సహాసానికి భారతదేశం దీటుగా స్పందించింది. దాడులను తిప్పికొడుతూ వైమానిక స్థావరాలపై విరుచుకుపడింది. అంతకు ముందు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చో హ్యూన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని దక్షిణ కొరియా ఖండించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సియోల్‌ను సందర్శించిన భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో చాలా మంచి సమావేశాలు జరిగాయని ఆయన గుర్తు చేసుకున్నారు. జైశంకర్ మాట్లాడుతూ 'ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దక్షిణ కొరియా ఖండించినందుకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే మా పార్లమెంటరీ ప్రతినిధి బృందం సియోల్‌కు వెళ్ళినప్పుడు, వారు చాలా మంచి సమావేశాలు జరిగాయని నేను భావిస్తున్నాను. మీరే వారిని కలవడానికి ప్రయత్నించారు. దీన్ని తాము అభినందిస్తున్నాం' అని తెలిపారు. శనివారం విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో జరిగిన సమావేశం బాగుందని చో హ్యూన్ అన్నారు. 2015 నుంచి 2017 వరకు ఢిల్లీలో రాయబారిగా తన పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో గణనీయమైన మార్పులు జరిగాయని అన్నారు. గత 10 సంవత్సరాలలో మంచి మార్పులు జరిగాయని.. ఢిల్లీకి తిరిగి రావడం చాలా గొప్పగా అనిపిస్తుందని చో హ్యూన్ అన్నారు. పదేళ్ల కిందట ఈ నగరానికి వచ్చినప్పుడు, భారతదేశ సంస్కృతి షాక్ అయ్యానని.. భారతదేశంలో కొరియా రాయబారిగా పనిచేయడం నాకు చాలా గర్వంగా ఉందన్నారు. 2015-18 వరకు విదేశాంగ కార్యదర్శిగా పనిచేసిన ఎస్ జైశంకర్‌ను కలిశానని గుర్తు చేసుకున్నారు.

# 21న ఓయూలో హాస్టల్ భవనాలను.. ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

## ఆ హోదాలో ఓయూలో ప్రసంగించనున్న తొలిసీఎం






**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

ఉస్మానియా యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా రూ. 80 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఓయూ ఉప కులపతి ప్రొ. కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. సి కాశీం ఆదివారం సీఎం నివాసంలో ఆయన్ను కలిసి ఆగస్టు 21న జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డినే అని వారు చెప్పారు. అదే రోజు ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక" అనే అంశం మీద సీఎం ప్రసంగించనున్నారు.అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టళ్ల నిర్మాణాలకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. దాంతో పాటు ఈ కార్యక్రమంలో "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్" అనే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# గాజా పౌరులకు మెడికల్ వీసాల జారీని నిలిపేసిన అమెరికా.. ఎందుకంటే..!



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

: ఇజ్రాయెల్ సైన్యానికి–హమాస్ రెబల్స్‌కు మధ్య యుద్ధంవల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజల కు అమెరికా మరో షాకింగ్ న్యూస్ చెప్పింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేక మంది గాజా ప్రజలు చికిత్స కోసం యూఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. టెంపరరీ మెడికల్ హ్యూమానిటేరియన్ వీసాల ను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా గాజా ప్రజలకు అన్ని రకాల వీసాలను నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. గాజా నుంచి అమెరికాకు వచ్చే పాలస్తీనియన్‌లు హమాస్‌కు అనుకూలంగా ఉన్నారని, హమాస్‌కు నిధులు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. వారం క్రితం తీవ్రంగా గాయపడిన 11 మంది పాలస్తీనియన్ చిన్నారులు వైద్య చికిత్స కోసం అమెరికాకు వెళ్లడానికి ఆ దేశానికి చెందిన స్వచ్ఛంద సంస్థ 'హీల్ పాలస్తీనా' సహకరించిందని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ఈవిధంగా పెద్ద మొత్తంలో ప్రజలను తరలించడం సరైన చర్య కాదని పేర్కొంది. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయంపై పలు స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

యూఎస్–ఆధారిత స్వచ్ఛంద సంస్థ 'పాలస్తీనా చిల్డ్రన్స్ రిలీఫ్ ఫండ్' ఈ విషయంపై స్పందిస్తూ.. అమెరికా తీసుకున్న ఈ ప్రమాదకరమైన అమానవీయ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. గత 30 ఏళ్లుగా తాము వేలమంది పాలస్తీనా చిన్నారులను వైద్యం కోసం అమెరికాకు తరలించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ దాడులు, ఆహార కొరతవల్ల వేలాదిమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతుంటే ఇలాంటి ఆంక్షలు ఎలా విధిస్తారని ప్రశ్నించింది.

# హైదర్ నగర్ డివిజన్ జాతీయ బిసి సంఘం కమిటీ సభ్యుల నియామకం..



**శేరిలింగంపల్లి -ప్రజా స్వేచ్ఛ**
ఆదివారం రోజు జాతీయ బీసీ సంఘం 123 హైదర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పెద్దాపురం బాలకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణంరాజు కార్యాలయం నందు డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శేరి లింగంపల్లి నియోజకవర్గ జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు వి మాధవరావు అతిథులుగా బ్రాజుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు, 123 మాజీ డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్,హాజరయ్యారు.వారి చేతుల మీదగా కమిటీ సభ్యులకి నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి, వి మాధవరావు మాట్లాడుతూ, జాతీయ బీసీ సంఘం అణగారిన వర్గాలైనటువంటి బీసీల అందరి పక్షాన నిరంతరం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అగ్రవర్గాలవారు బీసీ వర్గాలను అణిచివేతకు గురి చేస్తున్నారని,బీసీ వర్గాలను విచ్చినం చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీలకు రాజ్యాధికారం రావాలి అంటే బీసీ వర్గాలు అన్ని ఐక్యంగా ముందుకెళ్లాలని,బిసి ప్రజల సమస్యలపై జాతీయ బీసీ సంఘం గా పిలుపునిస్తున్నామన్నారు. 42% బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని,డివిజన్ కేంద్రంలో స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి బీసీ సంఘం పనిచేయాలని, అన్నారు నిస్వార్థంగా ప్రజా శ్రేయస్సు కోసం బీసీల అభివృద్ధి కోసం బీసీ రాజ్యాధికార స్థాపనకై జాతీయ బీసీ సంఘం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలను గుర్తించి, ఐక్య పోరాటాలను నిర్వహించి పని చేయాలని, ఐక్యంగా డివిజన్ కమిటీ సభ్యులు పని చేయాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రాజకీయ, విద్య, వైద్య రంగాలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించేంతవరకు ఉద్యమిస్తుంది అన్నారు. హైదర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పెద్దాపురం బాలకృష్ణ, మాట్లాడుతూ.. డివిజన్ కేంద్రంలోని బీసీలను ఐక్యం చేసి డివిజన్లో స్థానిక సమస్యల పరిష్కారానికై, బీసీల పైన జరుగుతున్న అన్యాయాలపైన నిస్వార్థంగా డివిజన్ కమిటీ పని చేస్తుందని పై కమిటీ మాపై పెట్టిన బాధ్యతని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం హైదర్ నగర్ డివిజన్ ప్రధాన,కార్యదర్శి, బాల ప్రసాద్ డివిజన్ సహాయ కార్యదర్శులు, వెంకట శివ, నారాయణ స్వామి,శేఖర్, డివిజన్ ఉపాధ్యక్షులు, రవీంద్ర బద్రి, కావలి వెంకటేష్, కోశాధికారి, పి భాస్కర్,డివిజన్ కమిటీ సభ్యులు, కే విజయ్, మిగతా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రులు జరుపుకోవాలి సీఐ బాలస్వామి





గణేష్ మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సిఐ బాలస్వామి

**-ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ఆగస్టు. 17**
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకునేందుకు సీఐ బాలస్వామి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు ముల్లి జంగయ్య యాదవ్ పాల్గొన్నారు ముల్లి జంగయ్య యాదవ్ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు సీఐ బాలస్వామి మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను 9 లేదా 11 రోజులు మాత్రమే నిర్వహించాలని, మండపాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నిమజ్జనం సమయంలో గొడవలకు ప్రయత్నించేవారిని శాంతింపజేయాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వినాయక నిమజ్జనంలో డీజేలకు ఏలాంటి పర్మిషన్ లేదని భక్తిశ్రద్ధలతో నవరాత్రులు జరుపుకోవాలని అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని గణేష్ నవరాత్రులు పూర్తి చేస్తామని వినాయకుల మండపాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎస్సైలు గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హజ్రత్ జాన్పాక్ అమిరోద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు

<u>సుదూరప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు</u>



**మహబూబాబాద్ -ప్రజా స్వేచ్ఛ**
మహబుబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంలోనీ హజ్రత్ జాన్పాక్ అమీరోద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ దర్గా ముజాఫర్ లుగా షేక్ సర్వర్, షేక్ కరీంల ఆధ్వర్యంలో జరుగిన ఉర్సు ఉత్సవవాలు శనివారం రాత్రి: 8-00 గం. లకు ప్రారంభం కాగా, పూర్వం నుండి ఈ సందల్ (గంధం) వరంగల్ వారు మహ్మద్ ఆసీఫ్ అలీ, జిలానీ, ఫాఇమ్లు తీసుకోని వచ్చిన సందల్ (గంధం) ఉరేగింపుగా బయలుదేరి, రాత్రి 1-00 గం.కు దర్గాను చేరుకున్నాయి. అనంతరం ఖవాలి కార్యక్రమంనిర్వహించరు. ఆదివారం పెద్దఎత్తున ఉర్సు(ఫాతియా) ఉత్సవాలు నిర్వహించరు. అనంతరం మధ్యాహ్నం 12-30 గం.లకు మహఅన్నదాన కార్యక్రమం నిర్వహించరు. కాగా ఈ ఉర్సు ఉత్సవాలకు సూదురా ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, ఆదిలాబాద్, జనగామ, ఆలేరు, నల్గొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నుండి వేలాది భక్తులు వచ్చి సందర్శించుకొని మొక్కలుతీర్చుకున్నారు. ఈకార్యక్రమంలోఉపాధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా 786, ఎస్కె యూసుఫ్, కార్యదర్శి ఎండీ హాజరోద్దీన్, కమిటీ సభ్యులు ఎండీ మహ్మద్, ఎండీ సైదులు, యాకుబ్ పాషా, ఎండీ మైబెల్లి, ముబారక్ అలీ, ఎస్కె జామలొద్దీన్ తదితరులు ఉన్నారు.ప్రతీ యేడు ఘనంగా దర్గా ఉత్సవాలు: అమిరోద్దీన్ బాబా దర్గా కమిటీ అధ్యక్షులు ఎండీ అమీర్ పాషా
ప్రతీ యేడు కేసముద్రంలోనీ హజ్రత్ జాన్పాక్ అమీరోద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాము.ఈఉర్సుఉత్సవాలకుసూదురాప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కలు తీర్చుకుంటారు. ఈఉర్సు ఉత్సవవాలు (16 శనివారం) రాత్రి: 8-00 గం. లకు సందల్ (గంధం) ఉరేగింపు రాత్రి 1-00 గం.కు దర్గానుచేరుకుంటుంది. అనంతరం ఖవాలికార్యక్రమంనిర్వహించబడును. అదేవిదంగా తేది 17 ఆదివారం ఉర్సు(ఫాతియా) నిర్వహించ బడును. మధ్యాహ్నం 12-30 గం.లకు మహఅన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఏటెల్లి శ్రీనివాస్.



ఎటేల్లి శ్రీనివాస్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు



ప్రధాన కార్యదర్శి అప్పం చెన్నకేశవ్


**ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఏటెల్లి శ్రీనివాస్ ను ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎం.డి.ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శిగా అప్పం చెన్నకేశవ్,ఉపాధ్యక్షులుగా నోముల శంకర్,కోశాధికారిగా శివరాత్రి రమేష్,సహాయ కార్యదర్శి గా నడిగోటి నగేష్ లను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో సీనియర్ విలేకరులు భైరబోయిన రమేష్,బూరుగు వెంకటేశం, లవణం చంద్రశేఖర్,ఎం.డి. నజీమ్,కె వి ఎస్ రాజు, నడిగోటి కృష్ణ,దేవి రెడ్డి సత్తిరెడ్డి,ఎండి ఇర్ఫాన్, వీరమల్ల రమేష్,కైరంకొండ సంతోష్ పాల్గొన్నారు.

# 23న టీపీసీసీ పీఏసీ భేటీ

**స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై పీఏసీలో చర్చ**
**42%పై పార్టీ పరంగా భేటీలో తీర్మానం**
**ఆ తర్వాత ప్రభుత్వ పరంగా ముందుకు**



**హైదరాబాద్, -ప్రజా స్వేచ్ఛ**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం వీలున్న అన్ని అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఈ నెల 23న సమావేశం కానుంది. గాంధీభవన్‌లో జరగనున్న ఈ భేటీలో ప్రధానంగా ఈ అంశంపైనే చర్చించి.. పార్టీ పరంగా నిర్ణయానికి రానున్నారు. అనంతరం దానికి అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గంలో సమీక్షించి.. ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు, పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ తీసుకువచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్ర ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. అయితే నెలలు గడుస్తున్నా వీటిపై కేంద్రం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో అసెంబ్లీలో తీర్మానం ద్వారా జీవో తీసుకువస్తే ఎలా ఉంటుందన్నదానిపై న్యాయ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సమీక్షిస్తున్నారు. లేదా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి ముందుకు వెళ్లాలన్న అంశంపైనా పరిశీలన జరుగుతోంది. ఈ అంశాలపై చర్చించేందుకు పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ భేటీలో నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ భేటీ వాయిదా పడుతూ వచ్చింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు టీపీసీసీ పీఏసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోపాటు సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపైనా పీఏసీ భేటీలో చర్చించనున్నారు. అనంతరం ఒకటి, రెండు రోజుల తరువాత బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై క్యాబినెట్ భేటీ జరగనుంది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులు చాలా మంది ఉన్నారు మోడీ వాక్యాలు సరైనవి కావు బీ కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం**



**-ప్రజా స్వేచ్ఛ**
**షాద్ నగర్ ప్రతినిధి**
దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులను విస్మరించి,కేవలం ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరైంది కాదని,కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వాక్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ79వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.ఢిల్లీ ఎర్రకోటపై ప్రసంగిస్తూ ప్రధాని మోడీ ఆర్ఎస్ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరికాదని మహమ్మద్ ఇబ్రహీం అన్నారు.భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణ త్యాగాలు చేశారని, వారిని మర్చిపోయి తన ఘనతలను చెప్పుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులను విస్మరించడం సరైనది కాదని,ప్రధానమంత్రి చరిత్రను గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. భారతదేశంలోని కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరికాదని అన్నారు.

# నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి






**హైదరాబాద్ :పజా స్వేచ్ఛ**

తెలంగాణలోని నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. ఏపీపీ(అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి తాజాగా తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 118 ఖాళీలు ఉన్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 285 ఏపీపీ పోస్టులు ఉండగా.. వాటిలో 120 మంది మాత్రమే సర్వీసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త నియామకాలకు ప్రభుత్వం అనుమతి తెలపడంతో డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీవోపీ) పెద్దమొత్తంలో పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. మల్టీ జోన్ 1-50 ఖాళీలు, మల్టీ జోన్ 2-68 ఖాళీలు ఉన్నాయి.

**అర్హతలు:** ఈ పోస్టులకు అభ్యర్థులు లా డిగ్రీ అర్హత కలిగి ఉండాలి. బార్ కౌన్సిల్ లో ఎన్ రోల్మెంట్ తప్పనిసరి. రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్ల న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉండాలి. వయోపరిమితి జూలై 2025 నాటికి 34 ఏళ్లు మించకూడదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపులు ఉంటాయి. పూర్తి వివరాలకు అధికారిక https://www.tgprb.i వెబ్సైట్ను సందర్శించండి.

ఎంపిక విధానం: రాత పరీక్ష ఉంటుంది. పేపర్ 1, 2 నిర్వహిస్తారు. పేపర్-1 ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పేపర్-2 డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మెరిట్ ఆధారంగా తుది జాబితాను ప్రకటిస్తారు. జీతం నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 ఉంటుంది. అర్హత ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి.

## వనపర్తి పట్టణంలో పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**-ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**

వనపర్తి పట్టణం 1 వ వార్డ్ అధ్యక్షులు వంశమోని.విష్ణు కుమారుడు వెంకటేష్ వివాహం కాంచానతో ఎన్విఅర్ గ్రాండ్ బ్యాంకెట్ హాల్ లో జరిగింది. వివాహానికి హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.వనపర్తి పట్టణం 31 వ వార్డు కు చెందిన ఇంటలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు శ్రీనివాసులు యాదవ్ & అరుణ కుమారుడు అన్వేష్ యాదవ్ & సంధ్య ల వివాహం నిన్న జరిగింది. నేడు వారి నివాసానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెళ్లి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు వనపర్తి పట్టణం చెందిన పేట్ శ్రీనివాస్ రెడ్డి కుమారుడు వివాహ రిసెప్షన్ కు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.మాజీ మంత్రి వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్,మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ,ప్రేమ్ నాథ్ రెడ్డి, ఉంగ్లం తిరుమల్, బండార్ కృష్ణ,జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, డానియల్,నందిమల్ల సుబ్బు, తోట శీను,తదితరులు పాల్గొన్నారు.

## తరుణ్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్.




**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిది**

ప్రగతి నగర్లో కొత్తగా ప్రారంభమైన తరుణ్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ , డాక్టర్ తరుణ్ చౌదరికి తన కొత్త వైద్య ప్రస్థానంపై ప్రశంసలు తెలుపుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో వినోద్ చౌదరి, ప్రవీణ్, నాగసాయి, సింహాచలం, వినోద్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కి నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో తరుణ్ డెంటల్ హాస్పిటల్ విశేషమైన స్థానం సంపాదించాలని అందరూ ఆకాంక్షించారు.

## వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

డాక్టర్.జిల్లెల.ఆదిత్య రెడ్డి ఏఐపిసి నేషనల్ హెడ్(హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్)



**-ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**

హైదరాబాద్ గాంధీ నగర్ లోని,తెరత్ భవన్ లో ఆదివారం జరిగిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల.చిన్నా రెడ్డి,వ్యక్తిగత సహాయకుడు బాల కృష్ణ కుమార్తె మహాలక్ష్మి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏఐపీసీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ నేషనల్ హెడ్, వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డా.జిల్లెల ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఆగారం ప్రకాష్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**-ప్రజా స్వేచ్ఛ ఘనపూర్ /వనపర్తి జిల్లా ప్రతినిధి**

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన డీలర్ నరసింహ కుమార్తె వివాహానికి వారి ఆహ్వానం మేరకు ఖిల్లా ఘనపూర్ పద్మశాలి ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది.ఈ వివాహ కార్యక్రమానికి ఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లి,ఆ నూతన వదువరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో మీ నూతన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీర్వదించిన ఆగారం ప్రకాష్.ఈ శుభ కార్యక్రమంలో పాల్గొన్న మునగాల బాబు,దీర్ఘాయువు,పాల్గోని ఆశీస్సులు అందజేయడం జరిగింది.

## ఎస్.ఎన్ రెడ్డి గార్డెన్ లో వివాహ వేడుకకు హాజరైన యలమంచి ఉదయ్ కిరణ్...



**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిది**

ఆదివారం రోజున మియాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్ మియాపూర్ ఎం.ఎ.నగర్ కాలనీ వాసులు శ్రీకాంత్, రమ్య వివాహ వేడుకలో పాల్గొన్నారు. చందానగర్లోని ఎస్.ఎన్. రెడ్డి గార్డెన్ వేదికగా జరిగిన ఈ వేడుకలో మియాపూర్ ఎం.ఎ. నగర్ నివాసులు శ్రీకాంత్ రమ్య వివాహ వేడుక కి హాజరైన మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచి ఉదయ్ కిరణ్ , మియాపూర్ ఎం.ఎ . నగర్ నివాసులు శ్రీకాంత్, రమ్య వివాహ వేడుకలో పాల్గొని, కొత్త జీవితాన్ని ఆరంభించిన ఈ సందర్భంగా దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.చందానగర్లోని ఎస్.ఎన్. గార్డెన్ వేదికగా జరిగిన ఈ వేడుకలో ఎం.ఏ. నగర్ కాలనీ వాసులు కె. రాంబాబు, సురేష్, శ్రీకాంత్, ప్రవీణ్, రాజు,వినోద్ చౌదరి, ప్రవీణ్, వంశీ, నాగసాయి, సింహాచలం, వినోద్, సీనియర్ జర్నలిస్ట్ బండి రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందజేశారు.

## బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ సెక్రెటరీ గా మాణిక్ రావు నియామకం



**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా అర్బన్ సెక్రెటరీ గా శేరిలింగంపల్లి నియోజకవర్గం, మియాపూర్ డివిజన్ కు చెందిన పి. మాణిక్ రావు ను నియమించినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ కి మాణిక్ రావు చేసిన సేవకులకు గుర్తు గా ఈ పదవి లభించిందని, మరింత రెట్టింపు ఉత్సాహం తో పార్టీ బలోపేతానికి క్రుషి చేస్తారని వారు పేర్కొన్నారు. డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పత్తి బాషా శివ, విజేందర్ సింగ్, ప్రభాకర్, మహేష్ యాదవ్, వెంకట్, అనిల్, రాజాసింగ్ లు మాణిక్ రావు కు శుభాకాంక్షలు తెలిపారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**ఆగస్టు 17 జగ్గంపేట -ప్రజా స్వేచ్ఛ**





రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు సూచించారు.ఆదివారం సాయంత్రం జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై రఘునాధరావు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు మీరంతా సత్ప్రవర్తనతోమెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు,ఘర్షణలో పాల్గొన రాదని హెచ్చరించారు.రానున్న వినాయక చవితి పండుగలు ఎటువంటి అసాంఘిక, అల్లర్లకు దిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా గౌలి దొడ్డి ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకలు..




**-ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిది**

శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి గ్రామంలో ఎస్ ఆర్ ఫంక్షన్ హాలులో సేవా భారతి భాగ్యనగర్ సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చిన్న పిల్లల ఆటపాటలతో ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బాసర త్రిబుల్ ఐటీ రిటైర్డ్ వైస్ చైర్మన్. ప్రొఫెసర్ రాజ్ కుమార్, సేవా భారతి తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీ వాసు ఊసుల మూర్తి . గోల్కొండ బాగ్ సంఘచలక్ కర్త శ్రీ కొండ శ్రీకాంత్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నాయకులు సంఘ సేవకులు చింతల్ రాజన్న, జెరిపెటి ఈశ్వర్, బిక్షపతి. నర్సింగ్ రావు. ముద్దంగుల తిరుపతి. ముద్దంగుల గిరి, ఓం ప్రకాష్ , అరవింద్, దాత్రిక శ్రీనివాస్, డాక్టర్ నాగరాజు, మురళీధర్ రావు, హరి శంకర్ యాదవ్, విజయ రెడ్డి, గుంజ నాగేష్ , మంజుల హనుమంతు, వల్లపు గోవింద్,జరిపేటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

జగ్గంపేటలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



**-ప్రజా స్వేచ్ఛ జగ్గంపేట ప్రతినిధి**

ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ దినోత్సవం జగ్గంపేటలో ఆదివారం ఘనంగా జరిగింది.జగ్గంపేట నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చింతల రాంబాబు ఆధ్వర్యంలో నాలుగు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు పెనుగాడి సత్య సూర్యనారాయణ, ఏపీడబ్ల్యూజే అనుబంధ సంస్థ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చిక్కాల మణికంఠ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సభ్యుల హర్షద్వారాల నడుమ చిక్కాల మణికంఠ జెండా ఆవిష్కరించారు.స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో స్వీట్లు పంచి పండగ వాతావరణం తలపించారు.సీనియర్ ప్రసంగిస్తూ ఏపీడబ్ల్యూజే సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల పక్షపతిగా ఎన్నో సమస్యలు పరిష్కారంకు కృషి చేసిందన్నారు,ఐజేయుకు అనుబంధ సంస్థగా నిబద్ధతతో విలేకరుల కష్టాల్లో అండగా నిలుస్తుందని తెలిపారు.గత పోరాటాల్లో అక్రిడిటేషన్ విషయంలో గాని,విలేకరుల హక్కుల సాధనలో గాని ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు పెనుగాడి సూరిబాబు, రాయుడు బాబ్జి, చింతల రాంబాబు,నేదూరి శ్రీధర్,సుంకర శ్రీను, శేఖర్,వల్లభశెట్టి శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగ ప్రతినిధి రమ్య,డి నాని,మధు,బాబి,అరుణ, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజినెస్

## గృహ రుణాలపై ఎస్బీఐ బాదుడు

**-వడ్డీ రేట్ల పెంపు**

**-కొత్త ఖాతాదారులపై పావు శాతం భారం**




: దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గృహ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే నూతన రుణ గ్రహీతలపై మాత్రమే 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) పెంచుతున్నట్లు వెల్లడించింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు వెల్లడించింది. ముఖ్యంగా సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న ఖాతాదారులపై ఇది ఎక్కువ ప్రభావం చూపనుందని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లను పెంచింది. ఇతర బ్యాంక్‌లు కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకొవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాల వ్యవధిని బట్టి ఉండనుంది. ఇప్పటివరకు ఎస్బీఐ గృహ రుణ రేట్లు 7.50 శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా పెంపునతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. సిబిల్ స్కోరు తక్కువగా ఉండేవారికి ఇకపై అధిక వడ్డీ రేట్లను చెలించాల్సి ఉంటుంది."సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు ఇది వర్తించదు" అని ఎస్బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. యూనియన్ బ్యాంక్ రుణ రేట్లు గతంలో 7.35శాతం ప్రారంభం కాగా.. ఇప్పుడు దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45 శాతానికి చేర్చింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను పెంచడం ఆర్థిక వ్యవస్థలో బలహీనత సంకేతాలను స్పష్టం చేస్తోన్నాయి.

బ్యాంక్ పేరు రుణ రేటు(శాతం) ఎస్బీఐ 7.50-8.45 యూనియన్ బ్యాంక్ 7.45 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 7.90

యాక్సిస్ బ్యాంక్ 8.35 నెలకు రూ.450 అదనం

## ఆపిల్ లవర్స్ గెట్ రెడీ.. ఆ డేట్‌ను ఫిక్స్ చేసి పెట్టుకోండి.. ఐఫోన్ 17 సిరీస్ రాబోతుంది!

మీరు కొత్త ఐఫోన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటే, మీ క్యాలెండర్‌లో ఈ తేదీలను టిక్ చేసి పెట్టుకోవడానికి ఇదే సరైన సమయం. ఎందుకంటే.. తాగా లీక్స్ ప్రకారం.. ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ తేదీని ఎప్పటిలాగే సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ఉండనున్నట్టు తెలుస్తోంది. ఈసారి కూడా ఆపిల్ సెప్టెంబర్ నెల అంతా తన ఐఫోన్‌లు, వాచ్‌లు, ఇతర పరికరాలను లాంచ్ చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన మార్క్ గుర్మాన్, ఫోర్బ్స్ నివేదికల ప్రకారం ఆపిల్ సెప్టెంబర్ 9న ఐఫోన్ 17 సిరీస్‌ను లాంచ్ చేయనుందని సమాచారం. ఈ ఈవెంట్‌లో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, ఐఫోన్ 16 ప్లస్ స్థానంలో వచ్చే కొత్త ఐఫోన్ 17 ఎయిర్. మిగిలిన




మోడళ్లలో కంపెనీ స్పెక్స్ అప్‌గ్రేడ్‌లను తీసుకువస్తుంది.

**నివేదికల ప్రకారం.. ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ షెడ్యూల్**

**సెప్టెంబర్ 9:** ఐఫోన్ 17 సిరీస్, కొత్త ఆపిల్ వాచ్, ఇతర ఉత్పత్తులు లాంచ్ కానున్నాయి

సెప్టెంబర్ 12: ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో కోసం ప్రీ-బుకింగ్ ప్రారంభమవుతాయి

**సెప్టెంబర్ 19:** ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్ అమ్మకాలు స్టార్ట్ అవుతాయి

**ఐఫోన్ 17 ప్రో లాంచ్ డేట్, ధర వివరాలు..**

సెప్టెంబర్ 9న ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ అవ్వనున్నట్టు తెలుస్తోంది.ఐఫోన్ 17 ప్రో కూడా బ్లాక్, యాష్, వైట్, ఆరెంజ్, బ్రైట్ బ్లూ వంటి 5 వేర్వేరు కలర్స్‌లో రానుంది. ధరల విషయానికొస్తే ఈ ఐఫోన్ 17 ప్రో రూ. 1,45,900 ప్రారంభ ధరకు లాంచ్ కానున్నట్టు తెలుస్తోంది.

## మరింత తగ్గిన బంగారం ధర..

మన దేశంలో బంగారానికి డిమాండ్ ఎప్పుడూ ఎక్కువే. ముఖ్యంగా ఆడవాళ్లకు పుత్తడి మీదున్న మక్కువ చాలా ఎక్కువ. ఆడ, మగ అనే కాదు.. బంగారం ధరించేందుకు అందరూ ఇష్టపడతారు. ఒంటి నిండా నగలు వేసుకోవాలని ఆశపడుతుంటారు. కానీ, ఇటీవలి కాలంలో గోల్డ్ ధరలు భారీగా పెరిగాయి. మార్కెట్ ఒడిదుడుకులు, బంగారంపై ప్రజల్లో ఉన్న డిమాండ్ మేరకు పసిడి ధరలు ఎప్పటికప్పుడూ మారుతూనే ఉంటాయి. గత కొంతకాలంగా బంగారం ధరల్లో విచిత్రమైన మార్పులు కనిపిస్తున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన గోల్డ్ రేట్స్ ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మన దేశంలో బంగారం ధర ఎలా ఉందంటే.

హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో 17-8-2025 బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

భారతదేశం - 24 క్యారెట్ల బంగారం ధర 10గ్రాములు రూ.1,00,960లు కాగా, 22 క్యారెట్ల



బంగారం ధర 10 గ్రాములు రూ. 92,540లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,330లుగా ఉంది. అదే 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.92,900 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,180 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,750 గా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 గా ఉంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాముల ధర రూ.1,01,180 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.92,750 లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 లుగా ఉంది.

## సూర్య, బుమ్రా రెడీ.. టాపార్డర్‌లో వీళ్లకు చోటు దక్కేనా..?

ఆసియా కప్ పోటీలకు భారత స్క్వాడ్ ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఓపెనింగ్ నుంచి మిడిలార్డర్, బౌలింగ్ యూనిట్ వరకూ ఎవరిని తీసుకోవాలి? అనే అంశంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ మెగా టోర్నీకి సమతూకంతో కూడిన బృందం ఎంపిక ఇరువురికి సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయ్యాడు. మరోవైపు.. ఇంగ్లండ్ పర్యటనలో మూడే టెస్టులే ఆడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా సైతం తాను అందుబాటులో ఉన్నానని సెలెక్టర్లకు సమాచారమిచ్చాడు. దాంతో, ఆసియా కప్ స్క్వాడ్‌లో ఈ ఇద్దరూ ఉండడం ఖాయమనిపిస్తోంది.

ఆసియా కప్ సమీపిస్తున్నందున భారత సెలెక్టర్లు ఆగస్టు 19న ముంబైలో సమావేశం కానున్నారు. ఈ మీటింగ్‌లో స్క్వాడ్ ఎంపికపై స్పష్టత రానుంది. ఆసియా కప్ సెలెక్షన్స్‌కు తాను అందుబాటులో ఉన్నానని బుమ్రా సెలెక్టర్లకు చెప్పాడు. స్క్వాడ్‌లో చోటు కోసం ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ ఉంది.

**జస్ప్రీత్ బుమ్రా**

అయితే.. బృందంలో ఎవరెవరు ఉండాలి? అనే విషయమై సెలెక్టర్లు వచ్చే వారం సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు అని బీసీసీఐ విశ్వసనీయ




వర్గాలు తెలిపాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది పొట్టి ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. ఈ మెగా ఈవెంట్లో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి.

**కెప్టెన్‌గా సూర్య..**

పొట్టి ఫార్మాట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వీడ్కోలు పలకడంతో టాపార్డర్ కోసం గట్టి పోటీ నెలకొంది. ముఖ్యంగా ఓపెనర్ స్థానం కోసం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మలు బరిలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన గిల్‌కే కెప్టెన్సీ అందించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.అయితే.. స్పోర్ట్స్ హెర్నియా గాయం నుంచి కోలుకున్న సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ కావడంతో అతడికే సారథ్యం అప్పగించే అవకాశాలున్నాయి. ఎన్‌సీఏలో రాటుదేలుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉంది. రెండో వికెట్ కీపర్ కోసం ఇషాన్ కిషన్, జితేశ్ శర్మలు పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరిలో ఒకరిని సంజూకు బ్యాకప్‌గా సెలెక్ట్ చేసే అవకాశముంది.

## బాబర్, రిజ్వాన్‌పై వేటు.. పాక్ సారథిగా సల్మాన్ అఘా..!

ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న పాకిస్థాన్ స్టార్ ఆటగాళ్లపై వేటు పడింది. ఆసియాకప్ కోసం ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించిన స్క్వాడ్‌లో మాజీ సారథులు బాబర్ ఆజం , మహ్మద్ రిజ్వాన్ లకు చోటు దక్కలేదు. మెగా టోర్నీకి సమయం దగ్గరపడుతుండడంతో ఆదివారం సెలెక్టర్లు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఈ ఎడిషన్‌కు సల్మాన్ అఘా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.సీనియర్లు బాబర్, రిజ్వాన్ బదులు ఫఖర్ జమాన్ సయీం ఆయూబ్, సహిబ్జదా ఫర్హాన్‌లు టాపార్డర్‌లో ఆడనున్నారు. ఇక పేస్ బౌలింగ్ యూనిట్‌ను షాహీన్ అఫ్రిది, హ్యారిస్ రవుఫ్, స్పిన్ దళానికి మహమ్మద్ నవాజ్ నడిపించనున్నారు. ఆసియా కప్ కంటే ముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గడ్డపై జరుగబోయే ముక్కోణపు సిరీస్‌లో





పాక్ ఇదే స్క్వాడ్‌తో బరిలోకి దిగనుంది. ఆగస్టు 29న మొదలయ్యే ఈ టోర్నీలో ఆతిథ్య యూఏఈ, పాక్‌తో పాటు అఫ్గనిస్థాన్ పోటీపడనుంది.యూఏఈ గడ్డ మీద సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను దృష్టిలో ఉంచుకొని స్క్వాడ్‌లో భారీ మార్పులు చేసింది పాకిస్థాన్ బోర్డు. టీ20 వరల్డ్ కప్ నుంచి వరుసగా విఫలమవుతున్న సీనియర్లు బాబర్ ఆజం, మహమ్మద్ రిజ్వాన్‌లను పక్కన పెట్టేసింది. నిలకడగా రాణిస్తున్న కుర్రాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆసియా కప్ స్క్వాడ్‌లోకి తీసుకుంది.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** సహిబ్జదా ఫర్హాన్, సయీం ఆయూబ్, ఫఖర్ జమాన్, మొహమ్మద్ హ్యారీస్ (వికెట్ కీపర్), సల్మాన్ అఘా (కెప్టెన్), హసన్ నవాజ్, ఖుష్‌దిల్ షా, ఫహీం అష్రఫ్, హుస్సేన్ తలాట్, మహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సూఫీయాన్ మకీం, షాహీన్ అఫ్రీది, హారిస్ రవుఫ్, హసన్ అలీ, మహమ్మద్ వసీం, సల్మాన్ మిర్జా.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌లో ఇక అలా కుదరదు.. షార్ట్ రన్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం..!




ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. తీవ్రంగా గాయపడిన ఆటగాళ్లు మరితంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌ను అనుమతించేందుకు బోర్డు పచ్చజెండా ఊపింది. అంతేకాదు షార్ట్ రన్ పై, రిటైర్డ్ హర్ట్ అయిన బ్యాటర్లపై, వన్డే మ్యాచ్‌లో రెండు బంతుల వినియోగంపై కూడా కీలక నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.

## అందంతో పిచ్చెక్కిస్తున్న అనసూయ



# నిధి అగర్వాల్ బర్త్ డే స్పెషల్..

## క్యూరియాసిటీ పెంచుతున్న రెండు పోస్టర్లు




ఇటీవలే హరిహరవీరమల్లు సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది నిధి అగర్వాల్. ఓ వైపు అందాలు ఆరబోస్తూనే.. మరోవైపు తనలోని యాక్షన్ అవతార్‌ను కూడా చూపించింది. ప్రస్తుతం ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తోన్న ఈ భామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులు, ఫాలోవర్లు నిధి అగర్వాల్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. రాజాసాబ్ మేకర్స్ నిధి అగర్వాల్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ క్యారెక్టర్ పోస్టర్‌ను షేర్ చేశారు.మరోవైపు జ్యోతి క్రియేషన్స్ మైదాన్ ప్రొడక్షన్ ప్రాజెక్ట్‌లో నిధి అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 'ఆమె కండ్లు రహస్యాలను దాచిపెడతాయి. ఆమె చిల్‌ను తీసుకొస్తుంది. కానీ ఆమె ముఖం కనిపించకుండా ఉంది.. ' అంటూ డార్క్ షేడ్స్‌లో నిధి అగర్వాల్ చూస్తున్న స్టిల్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. నిఖిల్ కార్తీక్ డైరెక్టర్‌గా డెబ్యూ ఇస్తున్న ఈ చిత్రాన్ని పుప్పల అప్పల రాజు నిర్మిస్తున్నారు. ఫీ మేల్ సెంట్రిక్ సినిమాగా వస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను దసరా కానుకగా అనౌన్స్ చేయనున్నారు.




# ఓజీ మాయలో కన్మణి

పవన్‌కల్యాణ్ 'ఓజీ' సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. పియాంక అరుల్ మోహన్ ఇందులో కథానాయిక. వచ్చే నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ విషయంలో మేకర్స్ వేగం పెంచారు. అందులో భాగంగా కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్‌లుక్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో ఆమె కన్మణిగా కనిపించనున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలన్నీ 'ఓజీ'ని ఓ భారీ యాక్షన్ మూవీగా ఆవిష్కరించాయి.తాజాగా విడుదలైన ప్రియాంక ఫస్ట్‌లుక్ మాత్రం అందుకు భిన్నంగా ద 'ఓజీ'ని ఓ కలర్‌ఫుల్ ప్రేమకథగా ప్రజెంట్ చేస్తున్నది. సుజీత్ మార్క్ యాక్షన్ విస్ఫోటనంతోపాటు లోతైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని ప్రియాంక లుక్ చెబుతున్నది.మరోవైపు ఈ సినిమా నుంచి రెండో గీతాన్ని విడుదల చేసేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియారెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికె.చంద్రన్, మనోజ్ పరమహంస, సంగీతం: తమన్, నిర్మాత: డి.వి.వి.దానయ్య, నిర్మాణం: డి.వి.వి. ఎంటైర్టైన్మెంట్స్.



# స్టాలిన్' రీ రిలీజ్..

## మెగా అభిమానులకు చిరు స్పెషల్ వీడియో




అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి హీరోగా తమిళ దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన సూపర్ హిట్ చిత్రం స్టాలిన్. చిరంజీవి సొంత బ్యానర్ అయిన అంజన ప్రొడక్షన్ బ్యానర్‌లో ఈ సినిమా విడుదల కాగా.. 2006లో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించింది. అయితే తాజాగా ఈ సినిమాను 19 ఏండ్ల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఆగష్టు 22న మెగాస్టార్ బర్త్‌డే సందర్భంగా ఈ మూవీని రీ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మెగా అభిమానులను ఉద్దేశించి చిరు ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నాడు.'స్టాలిన్' చిత్రం విడుదలై దాదాపు రెండు దశాబ్దాలు కావోస్తుంది. ఇన్ని ఏండ్ల తర్వాత తిరిగి మళ్లీ నా పుట్టినరోజున ఈసినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర నిర్మాత నా తమ్ముడు నాగబాబు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఒక మంచి సందేశాన్ని సమాజానికి అందించింది. ఒక వీర జవాన్‌గా దేశ సరిహద్దుల వద్ద ఉన్న శత్రువులతో పోరాడడం కాదు. దేశం లోపల ఉన్నశత్రువులతో యుద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుసుకుని ఈ సమాజంలో అంతర్యుద్ధం చేయడానికి ఒక సామజిక స్పృహ కలిగిన పౌరుడిగా మారతాడు ఈ చిత్రంలోని స్టాలిన్. ఈ సమాజాంలో తనవలన మేలు పొందిన ప్రజలు తనకు కృతజ్ఞతలు చెప్పడం కాకుండా అలాంటి మంచి పనే ముగ్గురికి చేసి.. ఆ ముగ్గురిని మరో ముగ్గురితో చేయమని చెప్పడం ఈ సినిమాలో చాలా బాగా చెప్పబడింది. ఈతరం యువకులకు బాధ్యత కూడా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పిన చిత్రమిది. అలాగే ఈ సినిమాలో నటించిన నటులు ఖుష్బు, త్రిషలకి అలాగే ఇతర సాంకేతిక బృందంకి.. సంగీత దర్శకుడు మణిశర్మకి, దర్శకుడు మురుగదాస్‌కి నిర్మాత నా తమ్ముడు నాగబాబుకి నా హృదయపూర్వక అభినందనలు. ఈ చిత్రం మిమ్మల్ని మళ్లీ ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్ముతున్నాను అంటూ చిరు చెప్పుకోచ్చాడు.




# మీనాక్షి ఇంట్రెస్టింగ్ కామెంట్..

## ఉదయం ముద్దు పెట్టుకున్నట్టు, రాత్రి అక్కడ ఉన్నట్టు అనిపించింది..

టాలీవుడ్‌లో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న కథానాయికల్లో మీనాక్షీ చౌదరీ పేరు ముందు వరుసలో ఉంది. అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ దక్షిణాది ఇండస్ట్రీలలో 'లక్కీ ఛార్మ్'గా మారిపోయింది. ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఐదేళ్లే అయినా, మీనాక్షీ చౌదరీ పేరు ఇప్పుడు టాప్ హీరోయిన్‌ల సరసన వినిపిస్తోంది. మొదట అక్కినేని సుశాంత్‌తో చేసిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత రవితేజతో కలిసి 'ఖిలాడీ' లో నటించింది. ఈ రెండు సినిమాలు కమర్షియల్‌గా ఫలించకపోయినా, ఆమె నటనకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది.అయితే ఆ తర్వాత చేసిన సినిమాలు ఆమెను అగ్రనాయికల సరసన నిలబెట్టాయి.లక్కీ భాస్కర్ సినిమాలో 'సుమతి' పాత్రలో నటించి మెప్పించింది. సినిమా భారీ హిట్ కాకపోయినా, మీనాక్షీకి మాత్రం అది మైలురాయి లాంటిది అని చెప్పాలి. ఆ తర్వాత గుంటూరు కారం, విజయ్ తలపతి నటించిన గోట్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో వరుసగా మూడు భారీ విజయాలు సాధించింది.లక్కీ భాస్కర్ ?100 కోట్లు రాబట్టగా, గోట్ ?450 కోట్లు, సంక్రాంతికి వస్తున్నాం ?300 కోట్లుకి పైగానే వసూళ్లు రాబట్టింది. మొత్తానికి మీనాక్షి నటించిన ఈ మూడు సినిమాలు దాదాపు 800 కోట్లకి పైగా కలెక్ట్ చేయడం విశేషం. ఇక మీనాక్షి ఇటీవల తన పేరులో చిన్న మార్పు చేసింది. ఇంగ్లీష్‌లో 'Meenakshi'గా ఉండే పేరులో, అదనంగా ఒక A జోడించి Meenaakshi 'గా మార్చుకుంది. ఈ మార్పు వెనుక కారణం కెరీర్ లో ఎదగడం కోసమా లేకుంటే ఆధ్యాత్మిక విశ్వాసమా? లేక న్యూమరాలజీ ప్రభావమా అన్నది స్పష్టంగా తెలియదు. ఆ మధ్య వరసగా సినిమాలు చేసిన మీనాక్షి చౌదరి.. కొన్ని నెలలుగా సందడి చేయడం లేదు. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత ఈమె సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం నాగ చైతన్య, కార్తిక్ దండు సినిమాతో పాటు.. అనగనగా ఒకరాజులో చిత్రంలో నటిస్తుంది మీనాక్షి. ఈ గ్యాప్‌లో సోషల్ మీడియాలో అదిరిపోయే హాట్ షో చేస్తూ నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. అయితే ఈ భామ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఉదయం సూర్యుడిని ముద్దు పెట్టుకున్నట్టు, సాయంత్రం నక్షత్రాల మధ్య ఉన్నట్టు అనిపించిందని మీనాక్షి కామెంట్ చేసింది.

# రూటు మార్చి ఒకే లైన్‌లో..

## శివ నిర్వాణ, రవితేజ క్రేజీ కాంబో ఆన్ ది వే..!



టాలీవుడ్‌లో ఉన్న టాలెంటెడ్ డైరెక్టర్ల జాబితాలో ముందు వరుసలో ఉంటాడు శివ నిర్వాణ. కథను నమ్మి సినిమా చేసే అతికొద్ది మంది దర్శకుల్లో ఒకడు. చివరగా విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేశాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం అందుకోలేకపోయినా.. మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత కొత్త ప్రాజెక్ట్ ఏం ప్రకటించలేదు శివ నిర్వాణ. మరి ఈ దర్శకుడు ఎవరితో సినిమా చేయబోతున్నాడంటూ చర్చించుకుంటున్న వారి కోసం ఆసక్తికర వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. ఇంతకీ ఆ హీరో ఎవరనే కదా మీ డౌటు.. ఇంకెవరో కాదు టాలీవుడ్ యాక్టర్ రవితేజ.వితేజ అంటే మాస్ అప్పీల్, ఎనర్జిటిక్ డ్యాన్స్, యాక్షన్, కామెడీ, రొమాన్స్..ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని తెలిసిందే. శివనిర్వాణతో రవితేజ సినిమా చేయబోతున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమా తెరకెక్కించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ సారి రవితేజ రూటు మార్చి థ్రిల్లర్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడట. ఇప్పటిదాకా లవ్ స్టోరీలతో ఇంప్రెస్ చేసిన శివనిర్వాణ థ్రిల్లర్ జోనర్‌లో చేస్తున్న తొలి సినిమా కావడంతో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. శివ నిర్వాణ, రవితేజ ఇద్దరు తమ రూటులను మార్చి ఒకే ప్రాజెక్టుకు పనిచేయడం మూవీ లవర్స్‌కు పండగే అని చెప్పాలి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492